నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784



# ఆగస్టు 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

## నెలరోజులపాటు జరుగనున్న వర్షాకాల భేటీ

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**



జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్–పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో వర్షాకాలపు సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశముంది. గతలో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు రెండు భాగాలుగా జరిగాయి. మొదటి సమావేశం జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ కొనసాగింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాల రెండవ భాగం మార్చి 10న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిసింది.

# కెసిఆర్‌కు కొనసాగుతున్న చికిత్స

## ఆస్పత్రికి వచ్చిన కూతురు కవిత

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఆయన కూతురు కవిత పరా మర్శించారు.స్వల్ప అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తండ్రిని చూసేందుకు కవిత శుక్రవారం వచ్చారు. కవిత ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను పరామర్శించారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో ఆమె మాట్లాడారు. గురువారం సాయంత్రం కేసీఆర్ అస్వస్థతకు గురికావడంతో వైద్యుల సలహాతో ఆస్పత్రిలో చేరారు. అనంతరం వైద్య బృందం ఆయనకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించింది. వీటిలో బ్లడ్ షుగర్ స్థాయి ఎక్కువగా ఉండటం, సోడియం స్థాయిలు తగ్గినట్టు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు అవసరమైన వైద్యసహాయం అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొ న్నారు. ఆయన ఆరోగ్యంపై గురువారం రాత్రి వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. 'కేసీ ఆర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. నిశితంగా పర్యవేక్షణ కొనసాగుతోందని హెల్త్ బులిటెన్‌లో వివరించారు.

# హిమాచల్‌లో వరద బీభత్సం

## భారీ వర్షాలకు 63మంది మృతి..పలవురు గల్లంతు

**సిమ్లా- నేటి ప్రభాత సూర్య :**



హిమాచల్‌ప్రదేశ్‌పై జలఖడ్గం విరుచుకు పడింది. గత కొద్ది రోజులుగా ప్రకృతి ప్రకోపం చల్లారడం లేదు. ఓ వైపు కుండపోత వర్షాలు.. ఇంకోవైపు కొండచరియలు విరిగిపడడంతో భారీగా ప్రాణ, ఆస్తి జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక దజన్ల కొద్దీ గల్లంతయ్యారు. వారి వివరాలు తెలియడం లేదు. గత కొద్ది రోజులుగా హిమాచల్‌ప్రదేశ్‌లో నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు కారణంగా మేఘాలు రాష్ట్రాన్ని కమ్ముకున్నాయి. అంతేకాకుండా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇంకోవైపు భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. పదుల కొద్దీ గల్లంతయ్యారు. మరోవైపు అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. ఇక జూలై 7 వరకు అన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రూ.400 కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. మండి జిల్లాలో సహాయ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. రుతుపవనాలు జూన్ 20న హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి. తాజా సమాచారం ప్రకారం మండి జిల్లాలో 40 మంది మరణించగా, కాంగ్రాలో 13 మంది, చంబాలో ఆరుగురు, సిమ్లాలో ఐదుగురు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. 300 పశువులు చనిపోయాయి. ఇక విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో వేలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నీరు, ఆహారం కొరత కూడా ఏర్పడింది.

# హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పొరేటర్ అడ్డుకున్నారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు. హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మించాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు.ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకో వద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

# ఖర్గే రాకతో గాంధీభవన్‌లో సందడి


- సిఎం, మంత్రుల హాజరుతో భద్రత పెంపు
- పోలీసుల తీరుపై రేణుకాచౌదరి అసహనం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ సమావేశం కొనసాగుతున్న వేళ కార్యకర్తల తాకిడి పెరి గింది. ఏఐసీసీ చీఫ్ ఖర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు గాంధీభవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూ కట్టింది. కేడర్ లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వారిలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యక్తిగత సిబ్బంది కూడా ఉన్నారు. దీంతో ఆమె స్వయంగా పోలీసుల వద్దకు వచ్చి సిబ్బందిని లోపలికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్య రాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావుడి ఎక్కువైందంటూ రేణుకా చౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పీఏసీ సమావేశంలో పార్టీ నేతలకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. సమావేశం మొదలైన వెంటనే పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో చనిపోయిన మృతులకు సంతాపం తెలుపుతూ పీఏసీ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆపై ఏజెండా ప్రకారం పీఏసీ సమావేశం జరుగుతోంది. సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎంత మేరకు తీసుకెళ్లారనే దానిపై చర్చించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి చేరికలను ప్రోత్సహించాలని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాష్ట్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ వంటి కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై రిపోర్టును పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశంలో చదివి వినిపించారు. గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అంశంపై కూడా పీఏసీలో చర్చ జరిగింది.

# ఆపరేషన్ సిందూర్.. ముగ్గురితో యుద్ధం



- ఒక సరిహద్దు.. ఇద్దరు శత్రువులు
- పాక్‌కు మద్దతుగా చైనా, టర్కీల సాయం
- భారత్ బలగాల సమిష్టి విజయం ఇది
- డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఒకేసారి మేడు దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చిందని భారత డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌కు చైనా, టర్కీలు మద్దతుగా నిలిచాయన్నారు.శుక్రవారం న్యూఢిల్లీలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఏజ్ మిలటరీ టెక్నాలజీస్ అనే అంశంపై లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌ను చైనా ఎప్పటికప్పుడు సమాయత్తం చేసిందన్నారు. భారత్‌కు ఒక సరిహద్దు.. ఇద్దరు శుత్రువులు ఉన్నారన్నారు. కానీ నిజానికి ముగ్గురు శత్రువులు అని ఆయన వివరించారు. అందులో పాకిస్థాన్ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందన్నారు. పాకిస్థాన్ మిలటరీ వినియోగిస్తున్న హార్డ్‌వేర్‌లో 81 శాతం చైనాకు చెందినవేనని ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నడుమ భారత్‌పై పాక్ నిర్వహించిన దాడుల్లో చైనా తన ఆయుధాలను పరీక్షించుకుందని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ సైతం అదే తరహాలో సహాయం చేసిందన్నారు. ఈ యుద్ధంలో టర్కీ పైలట్లు నేరుగా పాల్గొన్నారని వివరించారు. పాక్, చైనాను ఎదుర్కొవడానికి బలమైన వాయు రక్షణ వ్యవస్థ ఉండాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద స్థావరాలను గుర్తించి.. వాటిని ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత సైనిక బలగాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్ వల్ల కొన్ని పాఠాలను సైతం నేర్చుకున్నామని చెప్పారు. మానవ మేథస్సుతోపాటు సాంకేతిక ద్వారా లెక్కలేనంత సమాచారాన్ని సేకరించి.. ఈ దాడులు నిర్వహించామని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వివరించారు. గతంలో మాత్రం ఇలా సమాచారాన్ని సేకరించడంలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్న మాట మాత్రం వాస్తవమన్నారు. అయితే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 21 లక్ష్యాలను గుర్తించి.. వాటిలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. అందుకు చివరి రోజు.. చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. త్రివిధ దళాలు ఐక్యత కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఎప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబాకు చెందిన ది రిసిస్టెన్స్ ఫ్రెంట్ ప్రకటించింది. దీంతో ఈ ఘటనకు కర్త, కర్మ, క్రియా అంతా పాకిస్థాన్ అని భారత్ నమ్మింది. దీంతో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అదే సమయంలో పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఇక పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది. ఆ క్రమంలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసి.. 100 మందికి పైగా ఉగ్రవాదులును హతమార్చిన సంగతి తెలిసిందే.

# రోశయ్య అరుదైన రాజకీయ వేత్త

- బడ్జెట్ సర్దుబాటులో ఆయనది అందెవేసిన చేయి
- 16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యది
- రోశయ్య జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**




దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బ్జడెట్ ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యని అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్య గారిదని అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని,. పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ప్రముఖులు సన్మానించారు. .ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషం. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు అదేవిధంగా ఈరోజు వారి విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇక వాక్పటిమ, వాగ్దాటి, చతురతలో రోశయ్య గారితో ఇంకొకరిని పోల్చలేం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్ గా నియామకం అయ్యి బిజెపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య గారు ఒకరు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ ఆజాత శత్రువు రోశయ్య గారని అన్నారు. రోశయ్య గారిది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని అన్నారు. రోశయ్య గారు శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు. యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య గారి ప్రసంగం ఒక పుస్తకం. 2008 ఉప ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలో రోశయ్య గారి ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగింది, వారి ప్రసంగాలకు నేను అభిమానిని.వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్య గారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నానని గడ్డం ప్రసాద్ అన్నారు.

# ఈద్గాను వివాదాస్పద నిర్మాణంగా గుర్తించలేం

- శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై హైకోర్టు కీలక నిర్ణయం

**నేటి ప్రభాత సూర్య డెస్క్:**

మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఆ జన్మభూమిలో షాహి ఈద్గా మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ హిందువాదులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తొసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టేసింది. పూర్తి విచారణకు ముందు మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించడం తుది తీర్పుపై ప్రభావం చూపిస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఈ మసీదు వివాదాస్పద నిర్మాణమంటూ మహేందర్ ప్రతాప్ సింగ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ముస్లింలు రాతపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ పిటిషన్లు దాఖలుచేశారు. తాజాగా అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ముస్లింపక్షానికి భారీ ఊరట లభించినట్లయింది. ప్రస్తుతం ఈ కేసును సింగిల్ జడ్జి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం విచారిస్తుంది. ఈ కేసులో హిందువుల వైపు నుంచి ప్రస్తుతం 18 పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

# రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్

## అల్లు అరవింద్‌ను విచారించిన ఇడి

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018–2019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో లస్కర్ మృతి

**ఖమ్మం :** రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ లస్కర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగింది. కలకోట గ్రామానికి చెందిన యంగల అప్పయ్య (50) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లస్కర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కలకోట గ్రామం నుంచి బోనకల్లులో గల ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి తన బైక్‌పై బయల్దేరాడు. రావినూతల గ్రామం వద్ద బర్రె బైక్‌కు తగలడంతో కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన బోనకల్లు సబ్ డివిజన్ డీఈఈ తమ్మరపు వెంకటేశ్వర్లు, ఏఈఈ రాజేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# పాశమైలారం సందర్శించిన సిఎస్ రామకృష్ణారావు బృందం

- సిగాచి ప్రమాద స్థలిని పరిశీలించిన హైలెవల్ కమిటీ
- ప్రమాద ఘటనలో మరొకరు ఆస్పత్రిలో మృతి

**సంగారెడ్డి- నేటి ప్రభాత సూర్య :**



పాశమైలారంలోని సిగాచి ప్రమాద ఘటనా స్థలిని సీఎస్ రామకృష్ణ రావు నేతృత్వంలోని హై లెవెల్ కమిటీ పరిశీలించింది. ప్రమాద స్థలిని హైలెవల్ కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీకి చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణ రావు, సభ్యులుగా రెవెన్యూ, ఇండస్ట్రీ చీఫ్ సెక్రటరీలతో పాటు కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైర్ డీజీ, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉన్నారు. ఘటనా స్థలిని పరిశీలించిన తర్వాత బాధిత కుటుంబాలతో కమిటీ మాట్లాడింది. సిగాచి యాజమాన్యంతో కూడా మాట్లాడి వివరాలను సేకరించనుంది. ఇక ప్రమాద స్థలిని గురువారం నిపుణుల కమిటీ పరిశీలించిన విషయం తెలిసిందే. సుమారు మూడు నాలుగు గంటల పాటు నిపుణుల కమిటీ విచారించింది. టెక్నికల్ అంశాలపై నిపుణుల కమిటీ నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. మరోవైపు ఈ ప్రమాద ఘటనలో మరొకరు మృతి చెందారు. దీంతో సిగాచి ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. సిగాచి పరిశ్రమలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమ్ రావు అనే వ్యక్తి శుక్రవారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భీరామ్ స్వస్థలం మహారాష్ట్ర. పోస్టు మార్టం అనంతరం భీమ్ రావు మృతదేహాన్ని స్వస్థలానికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాద స్థలిలో ఐదవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం నుంచి 61 మంది సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ దుర్ఘటనలో 38 మంది మృతి చెందారని.. అందులో ఇప్పటి వరకు 31 మృతదేహాలను గుర్తించామని వెల్లడించారు. ఇంకా 7మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఆస్పత్రి నుంచి ఇప్పటి వరకు 12 మంది డిశ్చార్జ్ అయ్యారని.. ప్రస్తుతం ఆస్పత్రులలో 23మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంకా 9 మంది ఆచూకీ లభించలేదని కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. వీరి కోసం ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సిగాచి పరిశ్రమ వద్ద బాధితుల ఆందోళన కొనసాగుతోంది. ఐదు రోజులు గడిచినప్పటికీ తమ వారి ఆచూకీ తెలియడం లేదంటూ వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన వారితో పాటు ఏపీ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన ఓ కుటుంబం కూడా నిరీక్షిస్తోంది.

# మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదనీరు

## కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి



**జయశంకర్ భూపాలపల్లి :** కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు.

# సంపాదకీయం

## కలవరపెడుతున్న ఉద్యోగరంగం !

ఐటి రంగం ఎంతగా ఊరిస్తుందో.. అంతగా క్షోభ పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఐటి ఉద్యోగులకు ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇటీవలల కాలంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారు. స్కిల్ లేకపోవడం కన్నా..ఖర్చులు తగ్గించుకునే ఉద్దేశంతో తొలగిస్తున్నారు. పేరు ప్రతిష్టలు ఉన్న కంపెనీలే ఇలా చేస్తున్నాయి. జీతం ఎక్కువగా ఉన్న ఉద్యోగులనే టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగం ఊడిపోవడంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజంగానే ఖర్చు తగ్గించుకునే పద్దతిలో వారిని పిలిచి జీతంలో కోతలు విధించి, వారిని కొనసాగించవచ్చు. కానీ ఆలా జరగడం లేదు. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్న తీరు తీవ్రంగా కలవరపెడుతోంది. ఉద్యోగం పోయినా బతకవచ్చన్న ధీమా లేకుండా పోతోంది. దానికి ఏదైనా రంగంలో రాణించే బహుముఖ ప్రావీణ్యం ఉండడం లేదు. పనిచేసుకునే పరిస్థితులు కూడా లేకపోవడం చూస్తున్నాం. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా, ఉపాధి రంగంలో అయినా రాణిస్తారు. విద్యావిధానంలో మార్పుల తోనే ఇది సాధ్యం.

కేవలం బట్టీ చదువుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు లోపిస్తున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా మార్కెట్ విస్తరించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా ఓ క్రమద్ధతిలో అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. ఎంతసేపు పెన్షన్లు పంచడం, కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్లు కట్టించడం ఇదే అభివృద్ధి కాదు. ప్రజలు తమకాళ్లమీద తాము నిలబడగలిగేలా వాతావరణం సృష్టించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాల విధానాలు ఉండాలి.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో క్వాంటమ్ గురించి సిఎం చంద్రబాబు మాట్లాడుతున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ స్కిల్ వర్సిటీ అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పని చేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ దావోస్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఉన్న వనరులతో ఏం చేయవచ్చన్నది ముందుగా తెల్చుకోవాలి. సహజవనరులు ఉన్నాయి. సముద్రతీరం ఉంది. ఇవన్నీ కూడా ఉపాధికి పెద్ద అభివృద్ధి కేంద్రాలు. ఇరు రాష్ట్రాల సిఎంలు పారిశ్రామక వేత్తలకు రెడ్ కార్పెట్ పరిచారు. ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి రావాలి. పన్నులు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు కాకుండా, ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్ఇజెడ్‌లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారుతున్నారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. గంగవరం పోర్టు, పోలవరం ప్రాజెక్ట్, ఫార్మాసిటీల లాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి ఘోరాలు జరక్కుండా దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి.

తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పోయారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను కూడా గుర్తించని కంపెనీలు వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. సిగాచీ పరిశ్రమలో జరిగిన దారుణమే ఇందుకు నిదర్శనం. పరిశ్రమలను ప్రోత్సహించి, ఆరోగ్యకర వాతావరణంలో ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రోత్సహిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఆయా కంపెనీల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని ప్రభుత్వాలు చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. అలాగు భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. ఉద్యోగ,ఉపాధి రంగాలకు పెద్దపీట వేసినప్పుడే స్వయం సమృద్ధి సాధ్యం కాగలదు.

# దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

సంస్థాగత ఎన్నికల ప్రక్రియను భారతీయ జనతా పార్టీ వేగంగా ముందుకు తీసుకుని వెళ్తున్న వేళ కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా దక్షిణాదిలో పాగా వేయాలన్న బలమైన కోరికతో ఉంది. ఉత్తరాది పార్టీ అన్న ముద్రను తొలగించుకునే క్రమంలో వేస్తున్న అడుగులు ఇప్పుడు జాతీయ అధ్యక్ష పదవి విషయంలో ఆయరించే ప్రయత్నాలు మొదలయ్యాని తెలుస్తోంది. బిజెసి సాహసాలు చేయడంలోను, ప్రయోగాలు చేయడంలోనూ ముందుంటుంది. దీనితో ఏ పార్టీ పోటీపడలేదు. కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబ వారసత్వమే కొనసాగుతుంది. ప్రాంతీయ పార్టీల్లో కూడా వారసత్వ రాజకీయాలే ఉంటాయి. ఈ వాసనలు లేకుండా మనగలుగుతున్న పార్టీ బిజెపి మాత్రమే. ఇందులో చేరిన సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి దక్షిణాది నుంచి పార్టీ అధ్యక్ష పదవిని ఎంచుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. అందులోనూ మహిళలయితే మంచిదనే భావనా ఉంది. దీనికితోడు ఉత్తర, దక్షిణ భారతాలు కలుపుతూ...భాషా పరంగా నైపుణ్యాలు ఉండేవారిని కూడా వెతుకుతున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె హిందీ, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడడమే గాకుండా కఠినంగా పరిశ్రమ చేయగలరు. ఇకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో బిజెపి సారథుల నియామకాలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో అధ్యక్షులను ఖరారు చేశారు. ఈ క్రమంలో ఇటీవలే అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ అధ్యక్షుల ఎంపిక సాగింది. తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ పార్టీకి అంకితమై పనిచేస్తున్నవారే. ఇక్కడ కులాల కన్నా పార్టీకి అంకితమై ఉన్నవారినే గుర్తించారు. ఇలా అధ్యక్షుల ఎంపిక పూర్తయిన తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి భాజపా జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాదికి మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఎందుకంటే దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి ఇలా చేయడంలో ఆశ్యర్యం లేదు. గతంలో వెంకయ్యానాయుడు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరవాత ఉపరాష్ట్రపతి కూడా అయ్యారు. జాతీయ అధ్యక్ష పదవి రేసులో పరధానంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనించాలి. అలాగే పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కూడా దక్షిణాది నుంచి మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేం దుకు ఆలోచనలు చేస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో భాజపా అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2019లో తొలిసారి నిర్మలమ్మ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఆర్థికమంత్రిగా వి వం ర్శ లం వచ్చినా ఆమె దీటుగా జవాబిస్తున్నారు. ఓ రకంగా ఆమె మంచి వక్త కావడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. ఇకపోతే భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్1993 నుంచి భాజపాలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె కూడా ఈరేసులో ఉన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు బిజెపి కసరత్తు చేస్తోంది. అన్నామలైని తప్పించాలన్న డిమాండ్‌ను కూడా అంగీకరించింది. స్టాలిన్ ప్రభుత్వాన్ని సాగనంపే క్రమంలో ఈ ప్రయత్నాలు ఫలించవచ్చని అంటున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇతర పార్టీలకు ఇది ఓ చెంపపెట్టు కాగలదు. అలాగే బిజెపి చేస్తున్న కసరత్తు కూడా ప్రజల్లో ప్రభావం చూపగలదని భావిస్తున్నారు.




## సచివాలయ ముట్టడికి నిరుద్యోగుల యత్నం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

రాష్ట్ర సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలండర్ విడుదల, మెగా డీఎస్సీ ప్రకటించాలని శుక్రవారం సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు యత్నించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ర్యాలీగా వస్తున్న పలువురు నిరుద్యోగులను అడ్డుకోని మరీ పోలీసు వాహనాల్లో స్థానిక స్టేషన్‌లకు తరలించారు. అలాగే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి యత్నించారు. ర్యాలీగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముట్టడికి యత్నించారు. అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వాలని, జాబ్ క్యాలండర్‌ను అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముట్టడి నేపథ్యంలో ఉదయం నుంచే సచివాలయం పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

## బిజెపి నేత ఇంటిముందు రోహింగ్యాల రెక్కీ

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు ఇంటి ముందు రోహింగ్యాలు రెక్కీ నిర్వహించారు. అందెల శ్రీరాములు ఇంటి ముందు అనుమానాస్పద తిరుగుతున్న ఆరుగురు వ్యక్తులను బిజెపి కార్యకర్తలు, నేతలు గుర్తించారు. వారు పెట్రోల్ బాటిల్, సుత్తి, కట్టర్, ఐరన్ రాడ్స్, బాక్స్‌లో పెట్టుకుని తిరుగుతున్నారు. గత కొన్ని రోజులుగా రోహింగ్యాలపై బిజెపి నేత అందెల శ్రీరాములు యాదవ్ ఉద్యమం చేస్తున్నారు. అందెల శ్రీరాములకు ప్రాణహాని ఉందని బిజెపి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి నేతలు పట్టుకోవడానికి ప్రయత్నించగా వాహనం వదిలి పారిపోయారు. ఐదుగురు వ్యక్తులను గుర్తించి మిర్ పేట పోలీస్ స్టేషన్ కు బిజెపి నేతలు సమాచారం ఇచ్చారు. ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# విషం చిమ్ముతున్న దేశద్రోహులు

న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య : ఈ దేశంలో ఉంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపోర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హోం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి. ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికారులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హోమ్ మినిస్ట్రీకి చెప్పారట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందని తెలుస్తోంది. దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిని, వ్యతిరేకంగా పని చేసే వారిని గుర్తించడానికి కేంద్రం ఓ టీమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ టీమ్ దేశ వ్యతిరేక కార్యాకలాపాలపై దృష్టి పెడుతుంది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ గురుపత్వంత్ సింగ్ పన్నులాంటి వారి ఖాతాలు కూడా ఇండియాలో బ్యాన్ అవ్వనున్నాయి. ఈ కొత్త పాలసీ కోసం సోషల్ మీడియా కంపెనీలతో పాటు అమెరికా ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.




# జూరాలకు భారీగా వరదనీరు

### 14 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**గద్వాల- నేటి ప్రభాత సూర్య :**



ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది పరీవాహక ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం ఎగువ ప్రాంతం నుండి జూరాలకు 1,15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ప్రాజెక్టు 14 గేట్లు దిగువకు 95,566 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల కుడి, ఎడమ కాలువలు, బీమా లిఫ్ట్ 1, విద్యుత్ ఉత్పత్తికి, కోయిల్ సాగర్ సమాంతర కాలువలకు అన్నింటికీ కలిపి 1,27,659 క్యూసెక్కులకు వదులుతున్నట్లు- జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి మట్టం 129.72 టిఎంసిలకు గాను 90.91 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 94,767 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు 1,00,670 క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 37.646 టిఎంసిలకు గాను 30.98 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుండి 99,583 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 99,583 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. జూరాల జలాశయం 9.667 టిఎంసిలకు గాను 7.991 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణ పూర్ జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతుండడంతో అక్కడి ప్రాజెక్టుల నుండి వస్తున్న వరద నీటితో జూరాల వద్ద జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకొని జూరాల ప్రాజెక్టులపై ఆధారపడి నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు అధికారులు నీటి విడుదలను కొనసాగిస్తుండడంతో ఆయకట్టు- రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త టారిఫ్..

## ఇక మీ ఇష్టం..భారత్‌కు ట్రంప్ డెడ్‌లైన్

**నేటి ప్రభాత సూర్య, ఇంటర్‌నెట్ డెస్క్ :**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ లపై మరోసారి తన వైఖరేమిటో వెల్లడించారు. టారిఫ్ పై గతంలో తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. త్వరలోనే కొత్త టారిఫ్ అమలులోకి రాబోతోందనీ తెలిపారు. అనేక దేశాలపై కొత్తగా వడ్డించిన అదనపు వడ్డింపులకు డెడ్ లైన్ విధించారు. వాణిజ్య భాగస్వామ్య దేశాలన్నీ కూడా ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త టారిఫ్ ను చెల్లించాల్సి ఉంటుందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా దేశాలన్నింటికీ లేఖలు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నాటికి లేఖల పంపిణీ పూర్తవుతుందని, ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త టారిఫ్ అమలులోకి వస్తుందని అన్నారు.

శుక్రవారం నాడు 10 నుంచి 12 దేశాలకు టారిఫ్ లేఖలు పంపిస్తామని ట్రంప్ తెలిపారు. మిగిలివి- ఈ నెల 9వ తేదీ నాటికి పంపిస్తామని, తమ దేశ వాణిజ్య, విదేశాంగ మంత్రిత్వ శాఖలు దీనిపై కసరత్తు పూర్తి చేసినట్లు చెప్పారు. తమతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడానికి ఇది మొదటి గడువుగా అభివర్ణించారు. అమెరికా విధించే కొత్త టారిఫ్ మెజారిటీ దేశాలకు 10 నుండి 20 శాతం వరకు ఉంటోంది. మరి కొన్ని దేశాలకు చాలా అధికంగా అంటే 60 లేదా 70 శాతం వరకు ఉండబోతోంది. ఈ ఏడాది ఏప్రిల్ లో ట్రంప్ ప్రకటించిన 10 శాతం బేస్ లైన్ నుండి గరిష్టంగా 50 శాతానికి మించి ఈ సుంకాలు ఉండబోతోన్నాయి.

ఏఏ దేశాలకు ఎంత మేర టారిఫ్ ఉండబోతోంది?, ఏఏ వస్తువులపై అవి వర్తిస్తాయి? అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఈ విషయంపై డొనాల్డ్ ట్రంప్ ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. దీనిపై వాణిజ్య మంత్రిత్వ శాఖ కసరత్తు పూర్తి చేస్తోందని అన్నారు. ఈ నెల 9వ తేదీ తరువాత అంటే- లేఖల పంపిణీ పూర్తయిన తరువాత దీనిపై ఓ స్పష్టత వస్తుందని వివరించారు. జూలై 9వ తేదీ గడువులోగా అమెరికాతో ఒప్పందాలు కుదుర్చుకోని దేశాలపై సుంకాలు గరిష్ఠంగా విధించే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయాన్ని ముందు నుంచీ ట్రంప్ చెబుతూనే వస్తోన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన రెసిప్రోకల్ టారిఫ్ ను ప్రకటించిన ట్రంప్.. వాటిని అమలు చేయడానికి 90 రోజుల గడువు ఇచ్చారు. ఈ గడువు ఈ నెల 9వ తేదీ నాటికి ముగియబోతోంది. ఇప్పటివరకు- ట్రంప్ అడ్మినిస్ట్రేషన్.. యూకే, వియత్నాంలతో ఒప్పందాలను కుదుర్చుకుంది. భారత్ తో కూడా వాణిజ్య ఒప్పందం కుదరవచ్చని ట్రంప్ గతంలో ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే 48 గంటల్లో భారత్-అమెరికా మధ్య ఒక మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారు కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఖమ్మం-వరంగల్ రహదారిపై ఘోర ప్రమాదం

### రెండు లారీలు ఢీకొని మంటల్లో ముగ్గురు దహనం

**మహబూబాబాద్- నేటి ప్రభాతసూర్య :**



ఖమ్మం – వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతిచెందారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన వివరాల్లోకి వెళితే రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ మృత్యువాతపడ్డారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజి సమీపంలోని జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్, కేజర్ల ప్రాంతానికి చెందిన రాజురాం చౌదరికి ఇద్దరు కుమారులు. లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగానే చేపల దాణా కోసం విజయవాడ వెళ్లిన తండ్రి, చిన్న కుమారుడు సర్వణ్ రాం (23) రెండు లారీలతో విజయవాడ నుంచి రాజస్థాన్‌కు లారీలతో బయల్దేరారు. కుమారుడు లారీ ముందు వస్తుండగా పది నిమిషాల వ్యవధిలో తండ్రి లారీ వెనుక నుంచి వస్తోంది. వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోత్ గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో కాకినాడకు వెళ్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్‌రాం నడుపుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగావస్తున్న కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాళ్లు క్యాబిన్లపైకి దూసుకు రావటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోత్ గణేష్, సర్వణ్, రాం క్లీనర్ బర్గత్ ఖాన్ (23) సజీవ దహనమయ్యారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో కొడుకు లారీ వెనకాలే వస్తున్న తండ్రి రాజురాం చౌదరి తన కుమారుడి వాహనం ప్రమాదానికి గురైనట్లు గుర్తించాడు. మృతుడు గణేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్‌కు కూడా ఇటీవలే వివాహమైనట్లు తెలుస్తోంది. జాతీయ రహదారిపై లారీలు దహనమవుతుండటంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిపోయాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# పోటీ చేయని ఆ పార్టీలకు ఈసీ షాక్

**(నేటి ప్రభాత సూర్య-జనరల్ బ్యూరో)**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు సంవత్సరాలుగా ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేయని రాజకీయపార్టీలకు తమ గుర్తింపును కోల్పోయే ప్రమాదం పొంచిఉంది. ఈ మేరకు రాష్ట్రంలోని 13 రాజకీయ పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. తమ పార్టీల పేరును రిజిస్టర్డ్ జాబితా నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఈసీ పేర్కొంది. ఈ చర్యలు తీసుకునేందుకు గాను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పార్టీల పేరుతో దినపత్రికల్లో ప్రకటనలు, సోషల్ మీడియాల్లో ప్రచారం చేయడంతోపాటు ఆయా పార్టీలను జాబితానుంచి తొలగించాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన ప్రతిపాదనలను ఈ నెల 10వ తేదీలోపు సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారుల నుంచి అందే నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పంపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ పార్టీల వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. గతంలో కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఇలాంటి చర్యలు తీసుకుంది. నోటీసులు అందుకున్న పార్టీల్లో హన్మకొండ జిల్లాకు చెందిన తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ, హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ, జాగో పార్టీ, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, తెలంగాణ లోక్ సత్తా పార్టీ, తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం, యువ పార్టీ ఉన్నాయి. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్-ఫూలే), తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ, జాతీయ మహిళా పార్టీ, యువ తెలంగాణ పార్టీ, చివరగా వరంగల్‌కు చెందిన తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) కూడా నోటీసులు అందుకున్నాయి. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చిన్న పార్టీల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి

### చింతపల్లి పిహెచ్సి ని డిప్యూటీ డిఎంహెచ్వో ఆకస్మిక తనిఖీ





**చింతపల్లి- నేటి ప్రభాత సూర్య**
దేవరకొండ డిప్యూటీ డిఎంహెచ్ఓ . డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఓ పి, ఐ పి ముందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం 100 రోజుల టి బి క్యాంపులను గ్రామాల వారిగా నిర్వహించి టిబిఅనుమానితులకు తెమడా పరీక్షలు , ఎక్సరే చేయించాలని సూచించారు . గ్రామాలలో గర్భిణీ స్త్రీ లకు , పిల్లలకు అందిస్తున్న సేవలను ఆశ డే మీటింగ్ లో ఆశలను ఏ ఎన్ ఎం, ఎం ఎల్ హెచ్ బి లను సబ్సెంటర్ వారీగా రివ్యూ చేసారు.సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాలలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని,అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.వైద్య సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో చింతపల్లి . పి హెచ్ సి .వైద్యులు డా.శ్రీదేవి ,డా .ఇక్బాల్ ,పీహెచ్ సి సిబ్బంది ,సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్లు , ఏఎన్ఎం. ఆశాలు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ సమరభేరి సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి. జులై 4.**
హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి బహిరంగ సభకు మంచిర్యాల జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. వారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, యువజన, మహిళా, రైతు, కార్మిక విభాగాల ప్రతినిధులు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరారు.సమాజంలో న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ సభలో పాల్గొనేందుకు శ్రేణులు పెద్ద సంఖ్యలో ముందుకొచ్చారు.

## చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు : కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాలజిల్లా నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి, జూలై 4:**
విద్యార్థుల భవిష్యత్తు చదువుతోనే మారుస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి పాఠశాల వసతులను తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌తో కళాశాలలో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన ఫర్నిచర్, బెంచీలు, కంప్యూటర్లు వంటి వసతుల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధికి కావలసిన అంశాలపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మునిసిపల్ సిబ్బందికి ఆరోగ్య శిబిరం ఏర్పాటు

**ఈ అవకాశాన్ని మున్సిపల్ సిబ్బంది సద్విని చేసుకోవాలి**
**మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు**





**మందమర్రి నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4.**
100 రోజుల కార్యాచరణ కార్యక్రమములో భాగముగా తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మున్సిపల్ కమిషనర్ టి. రాజాలింగు ఆధ్వర్యంలో మందమర్రి మునిసిపాలిటీలో ఔట్సోర్సింగ్ పారిశుద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందికి మెప్మా స్వయం సహాయక సంఘాల సిబ్బందికి మరియు 24 వార్డుల ఆర్పి లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మందమర్రి వారి సహకారంతో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయటం జరిగినది.
ఆరోగ్య శిబిరాన్ని డిస్టిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ రాజు మరియు ఇతర డాక్టర్లు సందర్శించడం జరిగింది.అనంతరం మునిసిపల్ కమీషనర్. టి. రాజలింగు. మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం దృష్ట్యా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. వారు డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రతినెలా ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఇట్టి కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరు శ్రీమతి ఎం. సుమతీ, రెవిన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యం గోపికృష్ణ మెప్మా ఇన్చార్జి టీఎంసీ ఏ. రఘురాం తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
ఇట్టి కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది మెడికల్ ఆఫీసర్ శ్రీ ఆర్ రమేష్, జూనియర్ డాక్టర్లు ఎం. విష్ణు తేజ రెడ్డి మరియు డాక్టర్స్ స్పందన, సూపర్వైజర్ ఎస్. కళావతి, హెల్త్ అసిస్టెంట్ లు సుజాత, రాజేశ్వరి మరియు ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది.

## విద్యారంగం బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు: కలెక్టర్



**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4.**
జైపూర్ విద్యారంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జైపూర్ మండలంలోని పౌనూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను, బోధన ప్రమాణాలను, మధ్యాహ్న భోజన నిర్వహణను సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సరఫరా, శౌచాలయాలు, ప్రహరీ గోడ వంటశాల సదుపాయాలను మెరుగుపరచడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది," అని తెలిపారు. అలాగే, పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలపై అధికారులచే నివేదికలు రూపొందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పిల్లల విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు, శాఖ అధికారులు చొరవ చూపాలన్నారు.

## నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే సింగరేణి లక్ష్యం



**మందమర్రి, నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జూలై 4:**
నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణానే సింగరేణి సంస్థ ప్రధాన లక్ష్యమని బెల్లంపల్లి రీజియన్ నూతన (క్వాలిటీ) గోపాల్ సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మందమర్రి ఏరియాను సందర్శించారు.ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌తో కలిసి బొగ్గు నాణ్యత, ప్రాసెసింగ్, రవాణా తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తర్వాత గోపాల్ సింగ్ మాట్లాడుతూ "ప్రతి ఉద్యోగి నాణ్యతపై అవగాహన పెంపొందించుకోవాలి. సంస్థ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం" అని తెలిపారు.సింగరేణి బొగ్గు దేశవ్యాప్తంగా విశ్వసనీయత పొందాలంటే ప్రామాణిక నాణ్యతే మార్గమని స్పష్టం చేశారు. తాను నూతన బాధ్యతలలో బొగ్గు నాణ్యత మెరుగుపరచడం, సమర్థవంతమైన నిర్వహణకే కృషి చేస్తానని తెలిపారు.

## రామకృష్ణాపూర్‌లో వాహన తనిఖీలు: సీఐ శశిధర్ రెడ్డి



**మందమర్రి. నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4.**
రామకృష్ణాపూర్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గురువారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుర్మపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి స్వయంగా ఆధ్వర్యం వహించారు.తనిఖీల్లో సరైన డాక్యుమెంట్లు లేని వాహనాలకు జరిమానాలు విధించగా, నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు.
బైక్ నడుపుతున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడుపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సీఐ సూచించారు.అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని కోరారు.

## మానవత్వం చాటుకున్న ఫోటో గ్రాఫర్ అసోసియేషన్



**ప్రభాత సూర్య న్యూస్ కొండమల్లేపల్లి జూన్ 04**
కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదాసు గోవర్ధన్ అనే వ్యక్తి కొండమల్లేపల్లి పట్టణంలో ఫోటో గ్రాఫర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.సుమారు ఆరు నెలల క్రితం ఆదాసు గోవర్ధన్ అనుకోకుండా మరణించడం జరిగింది.అతనికి భార్య,ముగ్గురు పిల్లలు కలరు.కుటుంబ జీవనం సాగడం ఇబ్బంది కరంగా ఉందన్న విషయాన్ని తెలుసుకున్న ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ మానవత్వంతో శుక్రవారం రోజున వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ఫోటో,వీడియో అసోసియేషన్ వారు కుటుంబ భరోసా పథకం రూపాయలు 1,65, 000/- వేలు, కొండమల్లేపల్లి యూనియన్ రూ.10,000/-,దేవరకొండ యూనియన్ రూ.5500/-వేలు మొత్తం రూ. 1,80,500/- లు అంద చేసి మానవత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి భీమిడి మాధవ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పసుపులేటి కృష్ణ,మండలంలో అధ్యక్షులు మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, గౌరవ అధ్యక్షులు పాషా, బోడిగే రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చిరం బాబు, కోశాధికారి బోడిగే శంకర్ గౌడ్, ల్యాబ్ సతీష్,కుమార్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## వర్కింగ్ జర్నలిస్టులకు సింగరేణి క్వార్టర్లు కేటాయించండి

### మందమర్రి జీఎంకు టిడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రం



**మందమర్రి, జూలై 4 (నేటి ప్రభాత సూర్య ప్రతినిధి):**
వర్కింగ్ జర్నలిస్టులకు సింగరేణి క్వార్టర్లు కేటాయించాలనే కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మంచిర్యాల జిల్లా శాఖ ప్రతినిధులు మందమర్రి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ జి. దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు.జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు మాట్లాడుతూ, "జర్నలిస్టులు ప్రజా సమస్యలపై అహర్నిశలు కృషి చేస్తున్నా, తమకు సరైన వసతులు లభించడంలేదు. కనీస అవసరమైన నివాస వసతిని సింగరేణి సంస్థ కల్పించాలి," అని పేర్కొన్నారు. సంస్థ క్వార్టర్లు జర్నలిస్టులకు కేటాయించి మానవతా దృష్టితో సహాయపడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శ్రీనాథ్, మడ్డి వేణుగోపాల్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ సుమన్, కోశాధికారి భాస్కర్, సెక్రటరీ సురేష్, పట్టణ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నేతకాని మహర్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

### రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపు



**మంచిర్యాలజిల్లా నేటి ప్రభాత సూర్య జూలై 4:**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హరిత ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నాడు నేతకాని మహర్ కుల సంఘం రాష్ట్రస్థాయి ముఖ్య ప్రతినిధుల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ హాజరై, ఈ నెల 20న జరగనున్న నేతకాని మహర్ ప్రతినిధుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మహర్ సంఘం బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆయన సూచించారు.

## చలో హైదరాబాద్ - గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం



**మందమర్రి, జూలై 4 (నేటి ప్రభాత సూర్య ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి ఆదేశాల మేరకు గ్రామ శాఖ, మండల బ్లాక్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నాడు "చలో హైదరాబాద్" కార్యక్రమంలో భాగంగా బయలు దేరారు.హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొనే గ్రామ శాఖ అధ్యక్షుల బహిరంగ సభలో మందమర్రి కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద భాస్కర్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నేరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆఫీస్, సంఘీ సదానందం, ఉదయ్, తిరుమల్ రెడ్డి, ఆకారం రమేష్, మంకు రమేష్, మాయ తిరుపతి, ఎర్ర రాజు, రాచర్ల గణేష్, రాయబారం కిరణ్, ఎండి నిజాం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్టు



**మందమర్రి,నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4.**
మందమర్రి మండలంలో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బిఆర్ఎస్వి, బిఆర్ఎస్వై మరియు సోషల్ మీడియా కార్యకర్తలపై ఈ చర్యలు తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో రాజ్ కుమార్, ముస్తఫా, సాగర్‌లు ఉన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై, దాన్ని దాచేందుకు ఇలాంటి అక్రమ అరెస్టులకు పాల్పడుతోంది" అని మండిపడ్డారు.అలాగే, "ఎన్ని అరెస్టులు చేసినా ఇచ్చిన హామీలు అమలు అయ్యేదాకా ప్రభుత్వం తీరును ప్రశ్నిస్తూ పోరాటం కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి: కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు






**పీర్జాదిగూడ-నేటి ప్రభాతసూర్య:**
"ఒక మార్పు అభివృద్ధికి మలుపు అను నినాదం" తో ప్రారంభమైన 100 రోజుల ప్రణాళిక లో భాగంగా పట్టణ పరిధిలో "పారిశుద్ధ్య నిర్వాహణ కోసం అనునిత్యం కార్మికులు చేస్తున్న పనులు మరువలేనివని పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కమిషనర్ టిఎస్వీఎన్ త్రిల్లేశ్వర్ రావు అన్నారు."శుక్రవారం 33వ రోజు కార్యక్రమంలో భాగంగా కార్యాలయములో కెకెఆర్, ఇఎన్ టి హాస్పటల్స్ వైద్యుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటికి చెత్త సేకరణ, చెత్తను వేరు చేయు విధానం, వీధికుక్కల నియంత్రణ కార్యక్రమ ములపై అవగాహన, గోడలపై స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కాకతీయ నగర్, సాయి హిల్స్ కాలనీలలో ఇంటింటికి మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇ.ఇ జి.సాయినాథ్ గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిశోర్, ఎస్ఐ ప్రవీణ్కుమార్, ఇన్విరాన్మెంటల్ ఇంజనీర్ జి. బాల మురళికృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట మండలం బీసీ సేన మహిళా కమిటీ ఎంపిక



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 4):**
గ్రామ స్థాయి నుండి బీసీలు అభివృద్ధి కావాలంటే ముఖ్యంగా మహిళలలో చైతన్యం రావాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి ఆధ్వర్యంలో బీసీ సేన కేశంపేట్ మండలం మహిళా కమిటీని ఎన్నుకున్నారు. బీసీ సేన మహిళా అధ్యక్షులుగా పసుల వనమ్మ ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..గ్రామ స్థాయి నుండి బీసీలు అభివృద్ధి కావాలంటే ముఖ్యంగా మహిళలలో చైతన్యం రావాలని పిలుపునిచ్చారు.మహిళలు విద్యా పరంగా, ఉద్యోగ పరంగా,అభివృద్ధి కావాలంటే మహిళలు ముందుకు రావాలని కోరారు.మహిళా కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అవుసుల సౌజన్య,కార్యదర్శి సూరిగి శారద,ప్రచార కార్యాదర్శి చెరుకు మమత,సహాయ కార్యదర్శి ఏలూరి వసంత టౌన్ కోశాధికారి మొలగసి బాలమణి,నియోజకవర్గం యువజన అధ్యక్షులు పాలది శ్రీనివాస్,నందిగామ ఉపాధ్యక్షులు మొలగసి నర్సింలు,సోషల్ మీడియా కన్వీనర్ బాలు. పాల్గొని మండల బీసీ సేన మహిళా కమిటీ ఉపాధ్యక్షులుగా చౌడం శ్రీలత కల్వకోల్ కవిత, ప్రధాన కార్యదర్శులుగా కంచుకోట అనూష పిల్లి మాధవి, కార్యదర్శులుగా కుమ్మరి అశ్విని చుంచర మోని భవాని ఆకుల అరుణమ్మ, కోశాధికారిగా ఆనమోని ధనరేఖ, ప్రచార కార్యదర్శిగా బోయ లింగమ్మ, సహాయ కార్యదర్శిగా నాగుల యాదమ్మ, యువజన అధ్యక్షురాలు నక్క పుణ్యవతి, కార్యవర్గ సభ్యులు, సుర ముని నాగమణి, బుర ముని సుచరిత, పరమేశ్వరి ఆనముని కృష్ణమ్మ, రేణుక అఖిల, మండల కమిటీగా ఎన్నుకోబడింది మరియు మహిళలు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియపై అవగాహన



**మంచిర్యాల:జిల్లానేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4.**
దండేపల్లి బూత్ స్థాయిలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటూ మంచిర్యాల జిల్లా ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం దండేపల్లిలోని జెడ్పీ పాఠశాలలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ శిక్షణలో, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రోహిత్, మాస్టర్ ట్రైనర్ రాజన్నతో పాటు ఇతర అధికార్లులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సరిచూడటం, కొత్తగా పేరు నమోదు చేయడం, తప్పుల [illegible] సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను ఈ సందర్భంగా అందించారు.

## దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దాం

### చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గోరింకల నరసింహ్మా.



**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (జూన్ 4)**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చేతి వృత్తిదారుల రంగారెడ్డి జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఆయన విగ్రహానికి వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ గోరెంకల నర్సింహ్మా, కొమురయ్య విగ్రహానికి పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం గోరెంకల నరసింహ్మా మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దున్నేవాడికి భూమి కావాలని భూమి భుక్తి కావాలని వెట్టిచాకిరి పోవాలని జరిగిన మహా పోరాటంలో దొడ్డి కొమురయ్య తూటాలకు ఎదురొడ్డి ప్రాణాలు వదిలారని తన బలిదానమే నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఊపిరి పోసిందని అన్నారు. నేటికీ అదే వారసత్వం ఇప్పటికీ వృత్తిదారులలో తెలంగాణ ప్రజలలో ఉందని నాటి నైజాం దేశముకుల ఆగడాలను అరకట్టే దాంట్లో ఆంధ్ర మహాసభ పిలుపుతో ప్రజలు పోరాటంలో ముందున్నారని ఆయన అన్నారు. దొడ్డి కొమురయ్యని నేటి తరం యువతీ యువకులు వృత్తిదారులు ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకొని ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. దానికోసం ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ప్రజలకు చెరువ కావాలని పిలుపునిచ్చారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆయన వారసత్వాన్ని పునికి పుచ్చుకొని వృత్తిదారుల హక్కుల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విగ్నేష్,గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి అమీర్ పేట్ మల్లేష్, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేష్ మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చినమోని శంకర్,జి.ఎం.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు గౌర శ్రీశైలం,విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు సుంకోజు యాదగిరి చారి, సంఘాల నాయకులు సిహెచ్ వెంకన్న, బొద్రమోని నరసింహ్మా, పోచ మోని కృష్ణ జి మల్లేష్, రమేష్,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే: మల్లికార్జున్ ఖర్గే




### సామాజిక న్యాయ సమరభేరి సభలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 4):**
హైదరాబాద్‌లోని ఎల్ బి స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ, గ్రామ అధ్యక్షుల సమ్మేళనం, సామాజిక న్యాయం సమరభేరి సభ కు షాద్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో వేల మంది కార్యకర్తలు భారీ కాన్వాయిలలో ఆర్టీసీ బస్సులలో సభకు షాద్ నగర్ పట్టణం మరియుమండలాల నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. సభలో మల్లికార్జున్ ఖర్గే పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ సభలో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ యాదవ్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీనియర్ నేతలు బాబర్ అలీ ఖాన్, కొంకళ్ళ చెన్నయ్య, రఘు నాయక్, కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్ యాదవ్, గుండ్రాతి బాలరాజు గౌడ్, జగదీశ్వరప్ప, బస్వం అప్ప, వెంకట్ రామిరెడ్డి, మహిళా నాయకురాలు పిట్టల రజిత, జూలపల్లి అనసూయమ్మ, దాకం మనీష్, వాసు, యన్. యాదగిరి యాదవ్, గూడ వీరేశం, శివ శంకర్ గౌడ్, నవపేట్ రవీందర్ గౌడ్, అందే మోహన్, తదితర నాయకులు సభకు హాజరయ్యారు.

## అందెల శ్రీరాములు యాదవ్‌కు భద్రత కల్పించాలి

### రాష్ట్ర బిజెపి ఓబీసీ నాయకులు నారోజు కుమారస్వామి చారి



**బడంగ్ పెట్-నేటి ప్రభాత సూర్య:**
బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజక వర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ కు భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రబిజెపి ఓబీసీ నాయకులు నా రోజు కుమారస్వామి కోరారు. మొన్న పాకిస్థాన్ పై ఆపరేషన్ సింధూర్ జరిగినటువంటి సందర్భంలో కేంద్ర ప్రభుత్వం రోహింగ్యల పై విడుదల చేసిన మార్గ దర్శకాలను దృష్టిలో ఉంచుకొని బాలాపూర్ లో నివాస ముంటున్న రోహింగ్యాల వద్దకుఅందెల శ్రీరాములు యాదవ్ వెళ్లి పరిశీలించాలన్నారు బర్మా నుంచి 20 వేల మందికి పైగా రోహింగ్యాలు ఇక్కడ నివాసముంటున్నట్టు వారికి ఆధార్ కార్డు, సిమ్ కార్డు లు ,డ్రైవింగ్ లైసెన్స్ లు ఉండడానికి గమనించి పోలీస్ వారికి సమాచారాన్ని అందజేయడం జరిగిందని పేర్కొన్నారు ,ఆధార్ ,కార్డు సిమ్ కార్డులు ,డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తున్న ముఠాపైన చర్యలు తీసుకోవాలని బాలాపూర్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి వారి పైనా పిర్యాదు చేశారని ,వీటిని దృష్టిలో ఉంచుకొని రోహింగ్యాలు శుక్రవారం ఉదయం అందెల ఇంటి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని ప్రశ్నించగా రోహింగ్యానని ఒప్పుకున్నారన్నారు. వెంటనే అప్రమత్తమై ఆ వ్యక్తిని పరిశీలించగా బండిలో పెట్రోల్ బాటిల్. ఇనుప రాడ్లు ఉన్నాయన్నారు. వెంటనే అప్రమత్తమై పోలీసు సమాచారం అంద జేయడంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని అరెస్టు చేశారు. రోహిం గ్యాల వల్ల శ్రీరాములు యాదవ్‌కు ప్రాణహాని ఉంది కాబట్టిరాష్ట్ర ప్రభు త్వం వెంటనే భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచండి



### అర్హులకే రేషన్ కార్డు అధికార్లను ఆదేశించిన మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి

**తుర్కయంజాల్ -నేటి ప్రభాత సూర్య :**
ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని వార్డ్ అధికార్లకు తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. శుక్రవారం తుర్కయాంజల్ పురపాలక పరిధిలోని రాగన్న గూడ వార్డు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తన సిబ్బందితో కలిసి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, రేషన్ కార్డుల విచారణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటికే లబ్ధిదారులుగా ఎంపికైన వారి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా వార్డ్ అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా మిగిలి ఉంటే వారి వివరాలను వెంటనే కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. రేషన్ కార్డుల విచారణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సూచించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక భాగంగా భువన్ సర్వే, ట్రేడ్ లైసెన్సుల పునః పరిశీలన, పారిశుద్ధ్య పనుల నిర్వహణను ప్రాధాన్యతతో తీసుకొని, సమయానుసారంగా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో డి. ఈ, బిక్షపతి, ఆర్. ఐ వినయ్, వార్డ్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు డైరీలు పంపిణీ : ఎంఈఓ పాండురంగారెడ్డి




**యాచారం నేటి ప్రభాత సూర్య ( జులై 04):**
మండల పరిధిలో గునుగల్ నా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం మండల విద్యాధికారి పాండురంగారెడ్డి పలికారు. శుక్రవారం అనంతరం... అదే గ్రామానికి చెందిన దాతలు డాక్టర్ తోటి రెడ్డి నరసింహారెడ్డి( రిటైర్డ్ ప్రొఫెసర్ ) జై య శ్రీ దంపతులు విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు బాగా చదివి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏ పాండురంగారెడ్డి. జగన్మోహన్ రెడ్డి, ప్రేమలత, గిరిజ, శ్రీదేవి, ఉదయ కుమారి, శారద, జ్యోతి రాణి, జంగయ్య, కంబాలపల్లి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో ఆషాడమాసం రెండో శుక్రవారం పూజలు



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 4)**
షాద్ నగర్ పట్టణంలో శుక్రవారం ఆషాడ మాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని పెద్ద జానంపేట 12వ వార్డులో పోచమ్మ దేవాలయం వద్ద అమ్మవారికి కుంకుమర్చనలు, పూజలు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు నాయకులు ఎ.అభిలాష్,అమరలింగేశ్వర ప్రవీణ్, రేటికల్ నందీశ్వర్, ఆకుల ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు దిలీప్, ఆర్ ఎన్ రాజు, సుదీప్ జాదవ్, గండ్రతి శివయ్య, రాజయ్య, గండ్రతి కిరణ్, కిరణ్, ఎం. కృష్ణ, శ్రీశైలం, పూజారి ఉమాపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ

### కుమ్మరి రామచంద్రయ్య మొదటి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ..



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 4):**
కేశంపేట మండలం పోమాలపల్లి గ్రామంలో కుమ్మరి రామచంద్రయ్య మొదటి వర్ధంతి రోజున తండ్రిగారి జ్ఞాపకార్థంతో తన కుమారుడు కుమ్మరి శివశంకర్ యుపిఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ మరియు కుమ్మరి మహేష్, చాకలి మహేందర్,నిదురం రాజు యాదవ్ ,భావండ్ల రేణుక పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సతీమణి కొండి గారి ముత్యాలమ్మ మరణించగా ఆమె పార్థివ దేహానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, మడుపు వేణుగోపాల్ రావు, జెర్కొనిరాజు తదితరులు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్**

## పేకాట స్థావరంపై దాడులు.. నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం



కొండ మల్లేపల్లి -నేటి ప్రభాత సూర్య:

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు..మరో నలుగురు పరార్ లో ఉన్నారన్నారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కేశ్యతండా నుండి రాముని గుండ్ల తండాకు వెళ్లే దారిలో చోటు చేసుకుంది. ఎస్.ఐ రమేష్ అజ్మీరా తెలిపిన వివరాల ప్రకారం..పేకాట ఆడుతున్న సమాచారంతో తన సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు.వారి వద్ద నుంచి రూ. 31 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లను ,రెండు బైక్ లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.పరారీలో ఉన్న వారిని తొందరలోనే పట్టుకుంటామన్నారు. గేమింగ్ ఆక్ట్ ప్రకారం ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహశీల్దార్, అటెండర్



మంచిర్యాల జిల్లానేటి ప్రభాత సూర్య. ప్రతినిధి. జులై 4.

కేటపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో మరో అవినీతి ఉదంతం వెలుగులోకి వచ్చింది. డిప్యూటీ తహశీల్దార్ నవీన్ కుమార్, కార్యాలయ అటెండర్ ఒకరిపై ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్ చేసి పట్టుకున్నారు.ఒక రైతుకు పట్టా పాస్‌బుక్ జారీ చేసే విషయంలో డిప్యూటీ తహశీల్దార్ లంచం డిమాండ్ చేశాడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఉచ్చులో అధికారులు అఫరించిన లంచాన్ని తీసుకుంటున్న సమయంలో నవీన్ కుమార్‌తో పాటు అటెండర్‌ను పట్టుకున్నారు.ప్రస్తుతం వారిని అదుపులోకి తీసుకుని మరింత దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్న అవినీతి మరోసారి వెలుగులోకి వచ్చింది.

## మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు



మందమర్రి. నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4

మందమర్రి ఏరియాలో గల జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించినటువంటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి మరియు తమిళనాడు %ద% కర్నాటక మాజీ గవర్నర్. కొణిజేటి రోశయ్య గారి జయంతి వేడుకలు వేడుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్. జి.దేవేందర్ హాజరయ్యారు.

ముందుగా వారి చిత్రపటానికి పూలమాలవేసి వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జి.యం. దేవేందర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య గుంటూరు జిల్లా, వేమూరులో జన్మించార ని తండ్రి కిలారి కోటేశ్వరరావు గుంటూరు మిర్చి మార్కెట్ యార్డ్ కౌన్సిలర్ మరియు ఛైర్మన్‌గా పనిచేశారని. రోశయ్య గుంటూరు హిందూ కళాశాల మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రుడయ్యాడని.ఆయన రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చారని తన తండ్రి రాజకీయాల్లో ఉన్నందున,రోశయ్య కూడా రాజకీయాల్లోకి ప్రవేశించారని, కొణిజేటి రోశయ్య గారు 1968లో మొదటిసారిగా మరియు 1974, 1980 లలో శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారని. ఆయన 2009, సెప్టెంబరు 3 నుండి 2010, నవంబరు 24 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు అలాగే ఆర్థిక మంత్రిగా అనేక సంవత్సరాలు పనిచేశారు. 2009-10 బడ్జెటుతో కలిపి మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెటును ప్రవేశపెట్టారు. కొణిజేటి రోశయ్య తెలుగు రాజకీయ నాయకులు మరియు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నరుగా కూడా పనిచేశారు అని అన్నారు. తరువాత రాజకీయాలను వదిలేసి ఒక సామాన్య వ్యక్తి గా జీవించారు అని 88 సం,,లో ఉదయం పూట ఒక్కసారిగా బి.పి పడిపోవడం తో రోశయ్య గారిని ఆసుపత్రికి తీసుకువెళ్ళే మార్గమధ్యలో ఆయన తుదిశ్వాస విడిచారని జి.ఎం జి.దేవేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, ఏఐటీయూసీ. స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి రమణ జి.ఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుండి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం -నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్

తాటి చెట్టు పైకి ఎక్కి కళ్ళు గీస్తుండగా వ్యక్తి జారి పడి మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం, పోల్కంపల్లి గ్రామానికి చెందిన గుండ్ల జంగయ్య (56) కల్లు విక్రయమే జీవనాధారం. కల్లు తీసేందుకు చెట్టెక్కిన జంగయ్య ప్రమాదవశాత్తు జారి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు అతన్ని ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే జంగయ్య తుదిశ్వాస విడిచాడు. మృతుడికి భార్య జంగమ్మ, కుమారుడు అనిల్ కుమార్, వివాహమైన కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ముగ్గురు పిల్లలు ఉండగా, ఆమె భర్త మృతిచెందగా కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుమారుడు అనిల్ కుమార్‌కు ఇంకా వివాహం జరగలేదు.



జంగయ్య మృతితో పోల్కంపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ముమ్మారంగా కార్డెన్ సర్చ్

**చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా శిక్షారులే**

**శంషాబాద్ డిసిపి రాజేష్**

**సరైన పత్రాలు లేని 31 వాహనాలు సీజ్**

**10 కేజీల గుట్కా,85 గంజాయి చాక్లెట్లు స్వాధీనం**





కొత్తూరు, ప్రభాత సూర్య (జులై 04)

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు శంషాబాద్ డిసిపి రాజేష్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో అడిషనల్ డీసీపీ పూర్ణచంద్రరావు,ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి శంషాబాద్ డిసిపి రాజేష్ హాజరై తనిఖీలను పర్యవేక్షించారు. కొత్తూరు సీఐ నరసింహారావుతో కలిసి పలు కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా డిసిపి రాజేష్ మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రాల ప్రజలు ఉండడంతో గుట్కాలు, తయారీ,గంజాయి విక్రయించడం,అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కార్డన్ సెర్చ్ లో 10 సిఐలు,20 మంది ఎస్సైలు,100 హెడ్ కానిస్టేబుల్,ఏఎస్ఐలు, హోంగార్డులు,ఉమెన్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేయాలి : లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం




మంచిర్యాలజిల్లా నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4:

మంచిర్యాల జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీసీసీ కార్నర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విధించిన 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. "అగ్రకులాల కోసం కేవలం మూడు రోజుల్లో రాజ్యాంగ సవరణ చేసి 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన బీజేపీ ప్రభుత్వం, బీసీలకు మాత్రం న్యాయం చేయడంలో వెనుకడుగు వేస్తోంది" అని విమర్శించారు.అగ్రవర్ణాల రిజర్వేషన్లకు ఎలాంటి నిబంధనలు లేని సమయంలో, బీసీలకు మాత్రం సీలింగ్ అడ్డుగా ఉండటం అన్యాయమన్నారు. బీసీ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా సముచిత హక్కులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. సమితి లక్ష్యంగా పెట్టుకున్న లక్ష సంతకాల సేకరణ దశలవారీగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## నిన్న, మొన్న జాయిన్ కాలేదు... నేను సీనియర్ : డాక్టర్ నాగజ్యోతి చూడకుండానే నాకు అన్ని తెలుసు

**పేషెంట్లకు తప్పని తిప్పలు**

దేవరకొండ-నేటి ప్రభాత సూర్య:

నల్గొండ జిల్లా దేవరకొండ ప్రాంతీయ వైద్య శాలలో మరోసారి వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. ఆసుపత్రి వచ్చే రోగులను వైద్యులు అస్సలు పట్టించుకోవడం లేదు. ఇటీవలే నేరేడుగొమ్ము గ్రామానికి చెందిన నల్లవెల్లి అశ్విని మూడో కాన్పు కోసం వస్తే.. దేవరకొండ వైద్యుల నిర్లక్ష్యంతో నల్గొండ జిల్లా ఆసుపత్రికి పంపించారు. అక్కడ కూడా వైద్యులు నిర్లక్ష్యం చేయడం కారణంగా ఆ మహిళా కుర్చీలోనే డెలివరీ అయింది. దీంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆ సమయంలో విధుల్లో ఉన్న వారిని జిల్లా వైద్యాధికులు సస్పెండ్ చేశారు. అయినప్పటికీ వైద్యుల తీరు మాత్రం మారడం లేదు. ఇంకా అలాగే వ్యవహరిస్తున్నారు.

తాజాగా నేరేడుగొమ్ము గ్రామానికి చెందిన మరో వ్యక్తి దేవరకొండ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చాడు. ఈ నెల 07వ తేదీన డెంటల్ విభాగాన్ని సంప్రదిస్తే.. ఆ రోజు ఎవ్వరూ కూడా విధుల్లో లేరు. అక్కడ ఉన్న వారికి అడిగితే కొంత మంది తమకు తెలియదని చెప్పారు. తిరిగి మరల ఈనెల 04వ తేదీన ఏరియా ఆసుపత్రికి దంతాలకు సంబంధించిన సమస్యతో వచ్చాడు. అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ నాగజ్యోతి ఆసుపత్రికి సమయానికి హాజరు కాలేదు. దాదాపు 10.30 గంటల వరకు వేచి చూడాల్సిన పరిస్తితి నెలకొంది. వైద్యం కోసం ఎంత సేపు అయినా వేచి చూద్దామని వేచి చూసినప్పటికీ.. 10.30 గంటలకు హాజరైన డాక్టర్ నాగజ్యోతి పేషెంట్ నల్లవెల్లి ఆంజనేయులు తమ సమస్యను చెప్పాడు. అయితే సమస్యను వినకుండా కేవలం మాత్రలు మాత్రమే రాసి ఇచ్చింది. కనీసం చిగురు వాపు వచ్చిందని.. చిగురులోంచి బ్లడ్ వస్తుందని సమస్యను వివరించినా.. సమస్య తమకు పట్టదన్నట్టు చెక్ కూడా చేయకుండా టాబ్లెట్ వేసుకోండి అని రాసి ఇవ్వడం గమనార్హం. ఇదేమిటి మేడం అని ప్రశ్నించిన నల్లవెల్లి ఆంజనేయులు ని నేను నిన్న, మొన్న జాయిన్ దాన్ని కాదు.. నేను చూడకున్నా కానీ నాకు అన్ని తెలుసు అని సమాధానం చెప్పడం గమనార్హం. ఒక వైద్యురాలు ఇలా చేయడం ఏంటి..? ప్రశ్నించినప్పటికీ.. నా పేరు డాక్టర్ నాగజ్యోతి.. నేను చాలా సీనియర్ ఏం చేసుకుంటారో చేసుకోండి అని వచ్చిన పేషెంట్ నే బెదిరించడం విశేషం.

## అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి నాయకుల ఉద్యమాలను ఆపలేరు



చింతపల్లి-నేటి ప్రభాత సూర్య

అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘం విద్యార్థి నాయకుల ఉద్యమాలను ఆపలేరని భారత రాష్ట్ర సమితి పార్టీ విద్యార్థి విభాగం బిఆర్ఎస్వి చింతపల్లి మండల అధ్యక్షులు ఆరెకంటి మురళి మాదిగ అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ఏ ఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల నిరసన కార్యక్రమం సందర్భంగా నేడు చింతపల్లి పోలీసులు బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘ విద్యార్థి యువజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు మా ఉద్యమాలు మరింత ఉధృతంగా నిర్వహిస్తామని తెలియజేస్తున్నాము మీరు ఎన్ని అక్రమ అరెస్టులు,కేసులు పెట్టినా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నల్ల శంకర్, వందనపు ఆంజనేయులు, ఉప్పల యాదయ్య, మైనార్టీ నాయకులు ఖాలేద్, బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సీమర్ల శ్రీను యాదవ్, ఆరెకంటి పృధ్వీరాజ్, రాశిక శ్రీశైలం, మాసని పవన్ తదితరులున్నారు.

## నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

మర్రిగూడ: -నేటి ప్రభాత సూర్య



నాటు సారా తయారుచేసి అమ్మకానికి సహకరించిన వారిపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని మర్రిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మర్రిగూడ మండలం వేంకెపల్లి తండా సమీపంలో నాటు సారా తయారు చేసి, అమ్ముతున్న జటావత్ దశరథను పట్టుకున్నారు.పొలం వద్ద సిబ్బందితో కలిసి తనిఖీ చేసి, 3 లీటర్ల నాటు సారా, 2 క్వింటాళ్ల నల్ల బెల్లం, 10 కిలోల పటిక బెల్లంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.ఎవరైనా నాటు సారా తయారు చేసినా లేదా విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా కేసులు నమోదైన వ్యక్తులు నాటు సారా తయారు చేస్తే ఆ వ్యక్తులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. సిబ్బంది శంకర్ రెడ్డి, వహీద్ ఉన్నారు.

## డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం



మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 4.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చక్రపాణి, కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఓపెన్ డిగ్రీ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులలో అడ్మిషన్ కోసం అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆగస్టు 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను సంప్రదించాలని కోరారు.

## కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలపై టీఆర్ఎస్ నిరసన



మందమర్రి,నేటి ప్రభాత సూర్య. జూలై 4 (ప్రతినిధి) :

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మరియు చెన్నూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజా రమేష్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను టీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మందమర్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, "మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధించింది. అలాంటి నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధం" అని అన్నారు.

ఈ సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎంపీ తవడం రాజ్ కుమార్, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా సిఎంపీఫ్ సేవలకు కృషి

**ఉద్యోగుల క్లెయిమ్‌లను త్వరితగతిన పూర్తి చేయనున్న 'ప్రయాస్' విధానం**



మందమర్రి,నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి. జూలై 4:

ఉద్యోగులకు సిఎంపీఫ్ సేవలను వేగంగా, జాప్యం లేకుండా అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సిఎంపీఫ్ రీజనల్ కమిషనర్ హరి పచావూరి తెలిపారు. మందమర్రి ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సిఎంపీఫ్ పెన్షన్లకు సంబంధించిన లావాదేవీలు ప్రస్తుతం పూర్తిగా సీ-కేర్స్ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నూతనంగా క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించేందుకు 'ప్రయాస్' అనే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ చర్యలతో ఉద్యోగులకు మరింత వేగవంతమైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.